# రామాయణ, భారత, భాగవత సందేశాలు

– డా॥ మాలేపట్టు పురుషోత్తమాచారి

రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పారాయణ గ్రంథాలు. తరతరాల భారతీయ సంస్కృతికి అక్షరరూపాలు. ఆ మహాగ్రంథాలే ఆ తర్వాత కాలంలో భారతజాతినీ, భారతదేశ చరిత్రనూ, భారతీయ నాగరికతనూ తీర్చిదిద్దాయి.

వాల్మీకి రచించిన రామాయణం ఆదికావ్యం. ఇది దశరథుడి కుటుంబకథను వివరిస్తుంది. దశరథుడి కొడుకులయిన శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల జీవితాల్ని గురించి చెపుతుంది. ఈ కావ్యం రాముణ్ణి ధర్మానికి ప్రతినిధిగా వర్ణించింది.



వ్యాసవిరచితమైన మహాభారతం ఒక సంఘ చరిత్రను వర్ణించి చూపింది. ఇది ఒక ఇతిహాసం. ఇందులో కౌరవ పాండవులకు సంబంధించిన కథ ఉన్నా ఈ కథ ద్వారా మానవుడి నడవడికకు అవసరమైన ధార్మిక, నైతిక, సాంస్కృతిక విశేషాలెన్నింటినో ప్రతిపాదించి చూపింది.

వ్యాసుడు రచించిన భాగవతం ఒక పురాణం. ఇందులో భగవంతుడైన శ్రీకృష్ణుడి కథతోపాటు ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, కుచేలుడు మొదలయిన భగవంతుడి భక్తుల వృత్తాంతాలు కూడా ఉన్నాయి. భాగవతం పఠించడం వల్ల ముక్తి కలుగుతుందనే విశ్వాసం ఉంది.

భారతీయ సంస్కృతికి ఈ మూడు గ్రంథాలూ ఆధారాలు. ఇవి మానవుడి వికాసానికీ, సామాజిక వికాసానికీ, మానవత్వ వికాసానికీ దోహదం చేస్తాయి.



## రామాయణ సందేశం

రామాయణం మానవ జాతికి ఆదర్శగ్రంథం. అది జాతిని జాగృతం చేసింది. రామాయణంలోని పాత్రలు సహజంగా కనిపిస్తాయి. సకల మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి. ఆదర్శనారీమణి సీత. రాక్షసకులంలో పుట్టినా విభీషణుడు రామభక్తుడు. పక్షి అయిన జటాయువేమో మిత్రధర్మం పాటించినవాడు.

**సీత :** సీత జనక మహారాజు కుమార్తె. సకల సద్గుణవతి. శ్రీరాముని అర్ధాంగి. భర్తను సేవిస్తూ నీడలా అనుసరించడమే ధర్మంగా భావించింది. అత్తవారింట ఎంతో అనుకూలవతిగా వ్యవహరించింది.

శ్రీరాముడు తండ్రి ఆజ్ఞమేరకు అడవులకు బయలుదేరినప్పుడు ‘వనవాస కష్టాలు భరించలేవు’ అని ఎంతమంది వారించినా వినకుండా రామునివెంట



అడవులకు వెళ్లింది, 14 ఏళ్ళ వనవాస కష్టాలన్నీ అనుభవించింది. పతియే ప్రత్యక్షదైవం అని ప్రపంచానికి చాటిన ఆదర్శమహిళ సీత.

రావణుడి చెరలో వున్న పదినెలలూ అశోకవనంలో భర్తనే తలచుకుంటూ గడిపింది. రావణుడు ఎన్ని ఆశలు చూపినా, ఎంత భయపెట్టినా, ఎన్ని మాయలు పన్నినా వేటికీ లొంగలేదు. ఎంతో ధైర్యంగా భర్త రాక కోసం ఎదురుచూసింది. హనుమంతుడు సీతను రాముని చెంతకు చేరుస్తానన్నాడు. దానివల్ల తన భర్త పరాక్రమానికి మచ్చవస్తుందని, శ్రీరాముడు రావణుని జయించి తనను తీసుకువెళ్ళడమే ఉచితమని చెప్పి తిరస్కరించింది. ఈ విధంగా సీత ఆదర్శనారి అని చెప్పవచ్చు.

**విభీషణుడు :** రామాయణంలో విభీషణుని పాత్ర అపూర్వమైనది. ఇతడు రావణుని సోదరుడు,

సేవాపరాయణుడు, ధర్మతత్పరుడు. ఎవరు తప్పు చేసినా వారిని నిలదీసే స్వభావం గలవాడు. అధర్మ పరాయణుడైన రావణుని ఎదిరించిన మహావీరుడు. శ్రీరాముడిని శరణుజొచ్చాడు. ధర్మంవైపు నిలిచి శాశ్వతమైన కీర్తిని పొందాడు.

**జటాయువు :** జటాయువనేపక్షి అనూరుని రెండవ కుమారుడు. ఇతని తల్లి శ్యేని. తాత కశ్యపుడు. అవ్వ వినత. అన్న సంపాతి. జటాయువు దశరథుడి స్నేహితుడు. మిత్ర ధర్మానికి జటాయువు ప్రతీక. పంచవటిలో శ్రీరాముడి ఆశ్రమం నుంచి సీతను రావణాసురుడు ఎత్తుకొని పోతూ ఉంటే అతణ్ణి అడ్డగించినవాడు జటాయువు. రావణుడు కత్తితో జటాయువు రెక్కలను నరికేశాడు. జటాయువు నెత్తురు ముద్దగా నేలకూలాడు. సీతను వెతుకుతూ అటుగా వచ్చిన రామునికి జరిగిన విషయం తెలియజేసి మరణించాడు. శ్రీరాముడు జటాయువుకు దహనసంస్కారాలు చేశాడు.



**మూర్తీభవించిన ధర్మమే రాముడు**

మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. ఈ కావ్యంలో కనిపించే కథానాయకుడు శ్రీరాముడు. రాముడి జీవితమంతా ధర్మవ్రతానుష్ఠానమే. **రామో విగ్రహవాన్ ధర్మః**– మూర్తీభవించిన ధర్మమే రాముడు అని ధర్మద్వేషి రాక్షసుడు అయిన మారీచుడే అన్నాడు. రాక్షసుడే ప్రశంసించిన ధర్మపురుషుడు శ్రీరాముడు. ఒకే బాణం – ఒకే మాట – ఒకే పత్ని – అనేది రాముడి జీవితాదర్శం. రామాయణంలో బాలకాండనుంచి ఉత్తరకాండ వరకు ఏడుకాండల కథాజీవితంలో ఏడు ధర్మాలు పాటించి చూపాడు రామచంద్రమూర్తి.

**పుత్రధర్మం :** తల్లిదండ్రులే బిడ్డలకు మొదటి గురువులు. దేవతల్లాగే ఆరాధనీయులు. రాముడు తన జననీజనకుల విషయంలో అలాగే ప్రవర్తించాడు. దశరథుడు శ్రీరాముడికి



యువరాజ్య పట్టాభిషేకం చేయాలనుకొన్నాడు. తరువాత పట్టాభిషేకం భగ్నమై మళ్లీ తనను పిలిపించి పినతల్లి కైక వనవాసం వెళ్లుమని చెప్పినప్పుడు కూడా మారుమాట పలుకకుండా అరణ్యాలకు వెళ్లడంలో రాముడి పుత్రధర్మం కనిపిస్తున్నది.

**క్షాత్రధర్మం :** రాముడి క్షాత్రధర్మం మనకు అరణ్యకాండలో కనిపిస్తుంది. ఖరదూషణాది రాక్షసులు సీతారాములు నివసిస్తున్న దండకారణ్యంలో ఉన్న తాపసుల్ని హింసిస్తూ ఉంటారు. తమను కాపాడుమని రాముణ్ణి వేడుకొంటారు. రాముడు క్షాత్ర ధర్మాన్ని పాటించి రాక్షసుల్ని సంహరించాడు.

**మిత్రధర్మం :** కిష్కంధకాండలో శ్రీరామసుగ్రీవమైత్రిలో మిత్రధర్మం వికసించింది. రాముడు సుగ్రీవుడికి సహాయపడి కిష్కింధకు రాజును చేస్తాడు. సుగ్రీవుడు సీతను వెతకడంలో సహాయంచేస్తాడు. ఇలా వీళ్లిద్దరి మధ్య మిత్రధర్మం వర్ధిల్లింది.



**స్వామిధర్మం :** సుందరకాండలో శ్రీరాముడు హనుమపట్ల చూపింది స్వామిధర్మం. హనుమంతుడు లంకకు వెళ్లి సీతామాత జాడ తెలుసుకొని వచ్చి శ్రీరాముడికి నివేదించాడు. ఆ ఆనందంతో రాముడు హనుమను కౌగిలించుకొని గౌరవించాడు. ఒక గొప్పకార్యం చేసిన వాళ్లను అభినందించడం కూడా స్వామి ధర్మమే.

**వీరధర్మం :** శ్రీరాముడి వీర ధర్మం యుద్ధకాండలో కనిపిస్తుంది. వీరత్వమనేది రామచంద్రుడికి ఆజన్మసిద్ధం. విభీషణుడు శరణాగతుడై వచ్చినప్పుడు ఇతణ్ణి చేరదీయవద్దంటాడు సుగ్రీవుడు. అప్పుడు రాముడు మందహాసం చేసి “దేవదానవయక్షరాక్షసులు ఎవరైనాసరే, నేనుతలచుకొన్నానంటే కొనగోటితో మీటిపారేయగలను. నన్ను శరణువేడితే విభీషణుడే గాదు రావణుడైనాసరే అభయమిస్తాను” అంటాడు. తన వీరత్వంపై ఆయనకు

ఎంతటి ఆత్మవిశ్వాసమో చూడండి! ఇది ఒక్క మహావీరుడికే సాధ్యమవుతుంది.

**రాజధర్మం :** ఇది మనకు రామాయణం ఉత్తరకాండలో వ్యక్తమవుతుంది. రాముడు పాలించిన రాజ్యానికి రామ రాజ్యమని పేరు. శ్రీరాముడు పట్టాభిషిక్తుడై ప్రజారంజకమైన పాలన చేశాడు. సీతవిషయంలో ప్రజలు వేసిన నిందల కారణంగా,రాజధర్మంగా సీతాదేవిని అడవిలో వాల్మీకి ఆశ్రమ ప్రాంతానికి పంపించాడు. వాల్మీకి ఆశ్రమంలో సీతాదేవి తనకు కలిగిన సంతానాన్ని పెంచి, వాళ్లను శ్రీరాముడంతటి వాళ్లుగా తీర్చిదిద్దింది. వాళ్లు వాల్మీకి రచించిన రామాయణాన్ని గానం చేశారు. వాల్మీకి సన్నిధానంలో కుశలవుల్ని తన పుత్రులుగా స్వీకరించి వాళ్లను యువరాజులుగా ప్రకటించి, రాజధర్మాన్ని నిర్వర్తించిన పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు.



**రామాయణంలో ధర్మాచరణం**

శ్రీరాముడు ధర్మమూర్తి (రామో విగ్రహవాన్ ధర్మః) జీవితమంతా ధర్మాన్నే ఆచరించాడు. శ్రీరాముడు విశ్వామిత్రుడి ప్రబోధం ప్రకారం అరణ్యాల్లో ఎందరినో చంపుతున్న తాటకను సంహరించడం ప్రభుధర్మం. జీవితంమోడై, అదృశ్యంగా ఉన్న అహల్య మళ్లీ లోకంలో తలెత్తుకొని జీవించేవిధంగా శ్రీరామదర్శనంతోనే ఆమెకు శక్తిని ప్రసాదించాడు. కల్యాణరాముడై సీతతో అయోధ్యకు వెళ్లుతున్నప్పుడు పరశురాముడు అడ్డుకోగా, అతడి కోరిక మేరకు విష్ణుధనుస్సు చేతపట్టి, పరశురాముణ్ణి మహేంద్రగిరికి పంపించి దయాధర్మాన్ని నిలబెట్టుకొన్నాడు. తండ్రిమాట ఇది అని పినతల్లి కైక చెప్పగా, సింహాసనాన్ని వదలి, సీతాలక్ష్మణులతో అరణ్యానికి వెళ్లిపోయాడు. ఆ విధంగా పితృవాక్య పరిపాలనం చేశాడు.



అరణ్యంలో సీతాదేవిని రావణాసురుడు అపహరించినప్పుడు రావణుణ్ణి ఎదిరించి, జటాయువు పడిపోయాడు. సీత జాడ చెప్పి, జటాయువు మరణించాడు. రామలక్ష్మణులు జటాయువుకు చితిపేర్చి, తండ్రికి చేసినంత శ్రద్ధతో శాస్త్రసమ్మతంగా అంత్య కర్మ నిర్వహించారు. ఇది అపూర్వధర్మాచరణం. రామాయణగాథలో అధర్మమార్గంలో నడచిన వారందరికీ మరణం సంభవించింది. తమ్ముని భార్యనపహరించిన వాలి రాముని చేతిలో మరణించాడు. మాయ లేడిగా వచ్చిన మారీచుడు మరణించాడు. ధర్మమార్గంలో నడచిన సుగ్రీవుడు విభీషణుడు కిష్కంధాలంకలకు రాజులయ్యారు. శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడై వనవాసంలో ఎన్నోకష్టాలు పడినా, చివరకు ఆయన ధర్మానికి విజయం సిద్ధించింది. రాముడు అయోధ్యకు రాజు అయ్యాడు. ఈవిధంగా రామాయణంలో అడుగడుగునా ధర్మాచరణయే కనిపిస్తుంది.



**రామాయణం – జాతీయ దృక్పథం**

ప్రపంచ సాహిత్యంలోనే రామాయణం జాతీయ కావ్యం. వివిధ భారతీయ భాషల్లో రామాయణం అనువాదమై ఖ్యాతిని పొందింది. ఇది నాదేశం ఇవన్నీ నావి అని ఎవరనుకొంటారో, ఎవరు పరిరక్షిస్తారో వాళ్లు జాతీయ భావాలు గల మహోన్నతమూర్తులు. అలాంటి వాళ్లలో అందరికంటే ముందు చెప్పుకోదగ్గవాడు. రామాయణ కథానాయకుడైన శ్రీరాముడు. భారతదేశమంతా పర్యటించడం. సీతాపరిరక్షణ ఘట్టం ద్వారా లంకకు ప్రయాణం, సముద్రంపై వారధి నిర్మించడం, జటాయువుకు అంతిమ సంస్కారం నిర్వహించడం వంటివన్నీ భారతీయ జాతీయ సంస్కృతిని ప్రతిబింబించిన పనులే. రామాయణంలోనిదని పెద్దలంటున్న ఈ శ్లోకం జాతీయ దృక్పథానికి పరమోత్తమమైన ఉదాహరణ.

**అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే ।**
**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ ॥**

రావణవధానంతరం అందమైన లంకానగరంలోనే ఉండిపోదామన్నాడు లక్ష్మణస్వామి అన్నతో, అప్పుడు రాముడు ఇలా అన్నాడు "తమ్ముడా! లక్ష్మణా! ఈ లంకానగరం బంగారు మయం కానీగాక! నాకు ఇక్కడ ఉండాలనిపించదు. ఎందుకంటే కన్నతల్లి, కన్న నేల తల్లి, స్వర్గం కన్నా మిన్న సుమా! ఈ భావన భారతీయులందరిలో ఉండడమే జాతీయ దృక్పథానికి ఉన్న పరమ ప్రయోజనం.



# భారతసందేశం

మహాభారతం మన నిత్య జీవితానికి చాలా దగ్గరగా ఉంటుంది. సమిష్టిగా ఉంటే వచ్చే లాభాలు, విడిపోతే వచ్చే నష్టాలూ భారతంలో కనిపిస్తాయి. పాండవులు, కౌరవులు అన్నదమ్ముల బిడ్డలు. పాండవులు బాల్యం నుంచీ ధార్మిక వాతావరణంలో పెరిగారు. స్పర్ధ ఉంటేనే విద్య అబ్బుతుంది. కానీ ఆ స్పర్ధ మితిమీరి చివరకు ద్వేషంగా మారి, యుద్ధానికి దారితీసింది. పాండవులూ, కౌరవులూ ఒకే గురువు దగ్గర చదివినా,కౌరవులకు చదువు చదువుకోసమే పరిమితం అయింది. కానీ పాండవులకు మాత్రం అదే చదువు విజ్ఞానాన్నీ, ధర్మగుణాన్నీ, మంచితనాన్నీ నేర్పింది. ఈర్ష్య మానవుణ్ణి స్వార్థపరుణ్ణి చేసి ఎలా పతనానికి కారణమౌతుందో భారతంలోని దుర్యోధన పాత్ర నిరూపిస్తుంది.



**ధర్మరాజు :** పాండవాగ్రజుడైన యుధిష్ఠిరుడు అగ్నిజ్వాలల్లాంటి నలుగురు తమ్ముళ్లనూ తన ధర్మ శాంత సహనాలతో, హద్దుమీరని వాళ్లుగా చేయడం ధర్మజుడి ధార్మికనిష్ఠకూ, క్రమశిక్షణకూ నిదర్శనం. ఎంతటి బలవంతులైనా ధర్మానికి తలవంచాల్సిందే! నమస్కరించాల్సిందే! ధర్మశక్తి ప్రళయాగ్నిని కూడా చల్లబరుస్తుంది. కనుకనే ధర్మరాజు తన పేరును సార్థకం చేసుకొన్నాడు. యక్ష ప్రశ్నల వృత్తాంతం ఆయన విజ్ఞానానికి, జిజ్ఞాసకు నిదర్శనం.

**ద్రౌపది :** పాండవులయిదుమందికీ ఒకే భార్య – ద్రౌపది. తన ప్రవర్తన, నిజాయితీలవల్ల ఈమె అందర్నీ ఒకేదారిలో నడిచేటట్టుగా చేసింది. ద్రౌపది సంస్కారం, విశాలదృక్పథం, భర్తృసేవాపరాయణత మొదలైన గుణాల్ని గమనించే కృష్ణుడు సత్యభామకు ద్రౌపది ద్వారా ఉత్తమగృహిణీ ధర్మ బోధ



చేయించాడు. ప్రపంచ చరిత్రలోనే ద్రౌపదిలాగా కష్టాలు ఎదుర్కొన్న మరోవ్యక్తి కన్పించదు. ఆమె ఘోర సన్నివేశాల్లోనూ ధైర్యాన్ని కోల్పోక, భర్తల్ని నిందించక, వాళ్ల అసహాయ స్థితిని గ్రహించి, భగవంతుడైన శ్రీకృష్ణుడి సహాయంతో గట్టెక్కడమేకాక ఆ సభలోని కౌరవాది మూర్ఖులకు దైవధర్మబలాలు ఎంత గొప్పవో తెలిసేటట్టుగా ప్రవర్తించింది.

**విదురుడు :** మహాజ్ఞాని. కౌరవపాండవ పక్షాలకు త్రికరణ శుద్ధిగా మేలు కోరేవాడు. ధర్మాధర్మాలు చక్కగా తెలిసినవాడు. ధృతరాష్ట్రుడి వద్ద ఉన్నా బతుకు తెరువు కోసం కాదు. అతి సామాన్య జీవనం గడుపుతూ, ధృతరాష్ట్రుణ్ణీ, కౌరవుల్నీ మంచి దారికి తేవాలనీ, సమాజాన్ని పెడదారి పట్టనీయకుండా సుఖశాంతుల్తో ధార్మిక జీవనంతో విలసిల్లేటట్టుగా తీర్చిదిద్దాలనే మహోన్నత ఆశయం కల్గిన నిస్స్వార్థపరుడు, మహాభక్తుడు. విదురుడు ఉద్యోగపర్వంలో ధృతరాష్ట్రుడితో ఆయన చేసిన సంభాషణ విదురనీతిగా ప్రసిద్ధి చెందింది.

**శ్రీకృష్ణుడు:** ప్రపంచ చరిత్రలో శ్రీకృష్ణుడువంటి బహుముఖ ప్రతిభావంతుడూ, దివ్యమూర్తీ, ధర్మరక్షణ తత్పరుడూ అనేక ఉత్తమ శక్తి సామర్థ్యాలతో పేరొందిన వ్యక్తి ఏ యుగాల్లోనూ కనిపించడు. కృష్ణుడు బాల్యం నుంచీ విశాల భావాలతో, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం నడుం బిగించాడు. తనలోని దైవశక్తిని అవసరమైనప్పుడు ఉపయోగించు కొన్నాడు. తాను సాక్షాత్తూ శ్రీహరే అయినా, పల్లెటూరి జీవనానికి అలవాటుపడ్డాడు. తానే స్వయంగా గోకులంలో గోపాలుడై గోసంరక్షణావశ్యకతను లోకానికి చాటాడు. మిత్రులకు కల్గిన కష్టాల్ని తనకష్టాలుగా భావించి, వాళ్లకు నిరంతరం రక్షకుడుగా తోడ్పడ్డాడు.

కౌరవాదుల్ని తన దివ్యశక్తితో నాశం చేయగల్గినా సామదానాలతో మానసికంగా మార్పుతెచ్చి, జన నష్టాన్ని నివారించాలని గట్టిగా ప్రయత్నించాడు. అందుకే



రాయబారిగా వెళ్లాడు. నాకు అన్ని శక్తులున్నా–నేను రాయబారంలో మానవ ధర్మంతోనే ప్రవర్తిస్తానన్నాడు. ఒక మానవుడు తన ఆత్మశక్తితో ఎంతటి ఘనకార్యాలు సాధించవచ్చో నిరూపించాడు. అంతేకాదు – మానవుల్లోని మానసిక దౌర్బల్యం, బంధుప్రీతి, అధైర్యం మొదలైన చచ్చుపుచ్చు భావాల్ని పోగొట్టి, జీవితసమరంలో ధైర్యంగా నిల్చి, విజయం ఎలా సాధించాలో నేర్పాడు. ఆత్మజ్ఞానం కల్గి సంసారం చేస్తుంటే ఇహపరసుఖాలు హాయిగా సిద్ధిస్తాయనే గొప్ప సందేశాన్ని అందించాడు. ఏ అవతారంలో లేని ఉత్తమ ప్రబోధం భగవద్గీత ద్వారా నరులకు అందించిన నారాయణుడు – కృష్ణుడు.

**సంజయుడు :** ఇతని పేరులోనే ఇంద్రియాల్ని జయించినవాడనే అర్థం ఉంది. అర్థానికి తగ్గట్లు నిష్కళంకంగా జీవితం గడిపాడు సంజయుడు. ఇతడు ధృతరాష్ట్రుడికి ఆంతరంగికుడు. నిర్భయంగా ధర్మవిశేషాల్ని



చెప్పడంలో స్వపక్షపరపక్షభేదాలు లేని సమతాయోగి. కౌరవుల పక్షం నుండి పాండవుల వద్దకు రాయబారిగా వచ్చి, వాళ్ల అభిప్రాయాలు సూటిగా చెప్పాడు.

వ్యాసుడిచ్చిన దివ్యశక్తుల్తో యుద్ధవిశేషాల్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు సంజయుడు. ఇతడే భగవద్గీతను పూర్తిగా ధృతరాష్ట్రుడికి తెల్పిన మహనీయుడు. ఇతడి వల్లనే గీత లోకంలో వెల్గుచూచింది. ఇతని పాత్ర భారతంలో చిన్నపాటిదే అయినా కృష్ణవ్యాసుల అనుగ్రహానికి సంపూర్ణ పాత్రుడై ఇహపర ఆనందాలకు నోచుకొని, భగవద్గీతద్వారా తన పేరును చిరస్థాయిగా నిల్పుకొన్నాడు.

కనుక మనిషి నిష్కల్మషహృదయుడూ, ధార్మికజీవనుడూ, సచ్ఛీలుడూ అయితే అందరూ గౌరవిస్తారు. భగవత్కృపకు పాత్రుడవుతాడు అని సందేశం.



## భారతం – ధర్మవిజయం

భారతీయుల మహేతిహాసం మహాభారతం. అనేక శాస్త్రాల్ని, భౌతిక, పారమార్థిక ప్రయోజనాల్ని సమీకరించి, సమన్వయించిన గొప్పగ్రంథం. వేదాలు మొదలుకొని పురాణ, ఆగమ, ధర్మశాస్త్ర, జ్యోతిష, యోగాది విజ్ఞానాల్ని బోధించే ఇంతటి గొప్ప గ్రంథం మరొకటి లేదు. మహాభారతం అనేక కథలతోపాటు, అనేక ధార్మిక, సామాజిక విషయాల నిలయం. ధర్మార్థకామ మోక్షాలకు సంబంధించినవి అన్నీ ఇక్కడ ఉన్నాయి. ఇందులో లేనిది ఇంకెక్కడా లేదు అనే వ్యాసమహర్షి మాటల్ని పేర్కొంటాడు.

భారతం ధర్మ అర్థ కామ మోక్షాలు అనే నాలుగు పురుషార్థాల్ని వివరించే గ్రంథం. ధర్మాచరణం వల్లనే అర్థకామాలు కలుగుతాయి. ధర్మాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ కామం కోసంగానీ, అర్థం కోరిగానీ,

భయంవల్ల గానీ, ప్రాణరక్షణ కోసం గానీ విడువకూడదు. ధర్మం జీవులకు సుఖాన్నిస్తుంది. సుఖదుఃఖాలు అనిత్యాలు. నిత్యుడైన జీవుడు శాశ్వతమైన సుఖాన్నిచ్చే ధర్మాన్ని విడిచిపెడితే అనర్థం కలుగుతుంది.

తన ఈ ఆవేదనకు ఋజువుగా వ్యాసుడు తనవల్ల వృద్ధి పొందిన కురువంశకథనూ అధర్మవర్తనం కారణంగా తన కళ్లముందే జరిగిన కురుపాండవుల కురుక్షేత్రయుద్ధాన్నీ, తర్వాతి విశేషాల్ని ఇతిహాసంగా రాశాడు. ధర్మ–అధర్మ సంఘర్షణను వివరించాడు. చివరకు ధార్మాన్ని రక్షించిన ధర్మరాజునే భారత చక్రవర్తిగా చేశాడు.

మహాభారతం సంపూర్ణ మానవ జీవితానికి ప్రతిబింబరూపం. దానికి ఆదర్శవంతుడైన ధర్మరాజు నాయకుడుగా నిలిచాడు. ఆయన ధర్మం మూర్తీభవించిన మహితాత్ముడు. ఆవిరాడ్రూపానికి ఆలయాలవంటి వాళ్లు



నకుల సహదేవులు. అంగరక్షులు భీమార్జునులు. లోకంలో ఎలాంటి కార్యాన్ని సాధించడానికైనా మానవ ప్రయత్నం, దైవంతోడ్పాటు అవసరం. ధీమంతుడైన ధర్మసాధకుడు ఈరెంటినీ పట్టుదలతో సాధించి కృతార్థుడవుతాడు. ధర్మరాజు అలాంటి ధీశాలి.

శ్రీకృష్ణుడి దృష్టిలో నాయకుడైన ధర్మరాజు ధర్మవృక్షం. ప్రతినాయకుడైన సుయోధనుడు రోషమయ వృక్షం. దుర్యోధనుడికి అర్థకామాలే జీవితం. అతడికి ధర్మం తెలుసు. కానీ ఆచరించే హృదయ నిష్ఠలేదు. అర్థాన్ని సాధించడంలో తన ప్రయత్నాన్నే నమ్మి దైవసహాయాన్ని నిర్లక్ష్యం చేసి, స్వార్థంకోసం పాకులాడే దురభిమాని దుర్యోధనుడు. అతణ్ణి అనుసరించినవాళ్లే అతని తమ్ముళ్లు.

దీని అర్థం ఇది. నాయకుడు బలం, విద్య, శక్తి అనే సమర్థమైన సాధనాలతోగట్టిగా ప్రయత్నించి, ధర్మఫలాన్ని



సాధించగల సమర్థుడు. ధర్మరాజు శరీరం. భీమాదులు అవయవాలు. అతడు స్వయంగా ప్రతిభావంతుడు. దైవాన్ని ఆశ్రయించినవాడు. ప్రతినాయకుడికి ప్రత్యేక వ్యక్తిత్వం లేదు. కర్ణదుర్యోధనులూ, విద్యాబలశక్తులూ ఉపకరణాలుగా ఉన్నా ధర్మబద్ధంగా ప్రయోగించే ధర్మాత్ముడైన యజమాని వీళ్లకు లేదు. భీష్మాదులు అలాంటి ప్రయత్నాలెన్నో చేసి విఫలులయ్యారు. ధర్మసాధకాలు కాని ఈ ప్రతి వీరశక్తులు విశృంఖలవృత్తిని అనుసరించి స్వీయనాశనానికి దారితీశాయి. ధర్మరాజు ప్రవృత్తిలో ధర్మానికి అర్థకామాలు సేవలు చేస్తాయి. సుయోధనుడిలో అర్థకామాలు బలీయాలై ధర్మాన్ని బహిష్కరించాయి.

భారత విశ్వజనీన సిద్ధాంతమంతా నీవు ధర్మాన్ని రక్షిస్తే – ధర్మం నిన్ను రక్షిస్తుంది. అందుకే భారతం పంచమవేదమయింది. భీముడు రక్షకుడై ఉన్నంత కాలం ధర్మరాజును ఎవ్వరూ బంధించలేరు. భీముడు లేని పక్షంలో



ధర్మరాజుకు బలంలేదు అని దుర్యోధనుడు కపటోపాయం పన్ని భీముడికి హానితలపెట్టినా, అది వికటించి పాండవులు మరింత బలోపేతులయ్యారేగానీ వాళ్లు చెడిపోలేదు – అధర్మంపై ధర్మవిజయం ఇది. ధర్మం నివురుగప్పిన నిప్పులాంటింది.

దుర్యోధనుడు తనకెంతో ఆత్మీయుడైన పురోచనుడనే శిల్పిని రహస్యంగా పిలిపించి, వారణావతంలో లక్కయిల్లు నిర్మింపజేశాడు. పెదతండ్రి ఆజ్ఞ శిరసావహించి తల్లితోపాటుపాండవులు లక్కయింటిలో ప్రవేశించారు. దుర్యోధనుడు లక్కయిల్లు తగుల బెట్టించాడు. పాండవులు తల్లితోపాటు విదుర శ్రీకృష్ణుల సహాయంతో సురక్షితంగా తప్పించుకొన్నారు. ఇక్కడ కూడా అధర్మంపై ధర్మమే గెలిచింది.

**సారపు ధర్మమున్ విమల సత్యము పాపము చేత బొంకుచే**
**పారము బొందలేక చెడబారినదైన అవస్థ దక్షులె**

**వ్వార లుపేక్ష చేసి రది వారల చేటగు గాని ధర్మని**
**స్తార కమయ్యు సత్యశుభదాయకమయ్యను దైవముండెడున్**

ధర్మం మీద అధర్మం. సత్యం మీద అసత్యం దాడి చేసి, అణగదొక్కుతూ ఉంటే ఆ స్థితిని చక్కదిద్దగల దక్షులై ఉండీ, చూస్తూ ఊరుకొనే వాళ్లు కూడా ఆ పాపఫలం అనుభవించక తప్పదు. సత్యాన్ని, ధర్మాన్ని రక్షించి స్థాపించడానికి ఎల్లప్పుడూ దేవుడు ఉంటాడని చెప్పుమన్నారు.

కురుక్షేత్ర సంగ్రామం ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణే. ఇందులో అధర్మాన్ని అనుసరించిన కౌరవులు అంతమయ్యారు. ధర్మం పక్షాన వాసుదేవుడున్నాడు. అందుకే ధర్మం జయించింది. ధర్మరాజు రాజయ్యాడు. ధర్మాధర్మసంఘర్షణలో చివరకు ధర్మమే జయించింది. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే విజయం ఉంటుంది. **యతోధర్మస్తతో జయః** – అనే ధర్మసూక్తి సార్థకమయింది.



**భారతంలో ధర్మాచరణం :** మహాభారతం వ్యాసమహర్షి కాలంలో జరిగిన సంఘటనల ఆధారంగా రచించిన చరిత్ర. ఈ ఇతిహాసంలో, వ్యాసుల వారూ ఒక పాత్రే! ఇందులో ప్రపంచంలోని మానవుల మనసత్తత్త్వాలన్నీ కనిపిస్తాయి. అందుకే ప్రపంచంలో ఏముందో భారతంలో అదే ఉందనీ చెబుతారు.

పాండురాజు, మాద్రి ఇద్దరూ మరణించారు. కుంతి తన పుత్రులను, మాద్రీపుత్రులను సమాన ప్రేమతో పెంచి పెద్ద చేసింది. తల్లిగా అపూర్వ ధర్మాన్ని నిర్వర్తించిన రాజమాత కుంతి. అన్నమాటకుకట్టుబడి 'మాయాజూదానికి' తల ఒగ్గి అరణ్యాలకు ద్రౌపదితో, తమ్ములతో వెళ్లిన ధర్మరాజు సత్యసంధత ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచింది. అరణ్యంలో ఉన్నప్పుడు ఘోషయాత్ర నెపంతో దుర్యోధనుడు తనవైభవాన్ని ప్రదర్శించడానికి రాగా–



గంధర్వులు అతణ్ణి బంధించి తీసుకొని వెళతారు. అప్పుడు ధర్మరాజు దయాధర్మహృదయుడై భీమార్జునుల్నిపంపి అతణ్ణి విడిపిస్తాడు. ఈ సందర్భంలో ఎవరైనా మనమీదికి దండెత్తివస్తే మనం 105 మంది అన్నదమ్ములం అని చెబుతాడు. ధర్మాచరణకూ, దేశసమైక్యతకు ప్రేరణనిచ్చే విషయమిది.

అజ్ఞాతవాసంలో మారు పేర్లతో ఉన్న పాండవులు, ద్రౌపది విరాటరాజు కొలువుకూటంలో అందించిన సేవలు సేవాధర్మంలో భాగంగానే భావించాలి. కీచకుడి విషయంలో ద్రౌపదిని సంరక్షించిన భర్తగా భీముడి ధర్మాచరణం అందరికీ మార్గదర్శనం. కురుక్షేత్ర సంగ్రామ ప్రారంభంలో విషాదంలో పడ్డ అర్జునుడు క్షాత్రధర్మాన్ని వదలిపెట్టినప్పుడు ఎవరి ధర్మకర్మను వాళ్లే నిర్వహించవలసిందే అనిన గీతాచార్యుల గీతాబోధ ప్రపంచ మానవాళికే మార్గదర్శనం చేసింది.



ప్రపంచమంతా ధర్మాచరణంలో నడిచే విధంగా మహాభారతం మార్గదర్శనం చేస్తుంది.

**భారతం – జాతీయ దృక్పథం :** భారతంలో ధర్మరాజు చేసిన రాజసూయం కేవలం కీర్తికాంక్షకో, తమ తండ్రి స్వర్గప్రాప్తికో కాదు. దానికి ప్రధాన కారణం విద్వేషాలకు తావులేని ఒక జాతిని నిర్మించి సమైక్యంగా నిలపడమే. భీష్ముడు ఎన్నో అశ్వమేధాలు నిర్వహించాడు. అవన్నీ దేశాన్ని ఒకతాటిపై నిల్పడం కోసమే! కృష్ణుడు చేసిన గోసంరక్షణ, చేయించిన భారతయుద్ధం మొదలైనవి కూడా ఈ సదుద్దేశంతోనే. ఛిన్నాభిన్నమయిన దేశసమైక్యతను కాపాడడంకోసమే. ఆయా పరిస్థితుల్లో యుద్ధాలు–యాగాలు నిర్వహించినా అవి దేశసమగ్రతనూ, సంస్కృతినీ పరిరక్షించడం కోసమే! దీనికోసం ప్రాచీనకాలం నుంచీ చక్రవర్తులు ప్రయత్నిస్తూనే వచ్చారు.

భీష్ముడు కురుపాండవులలో దుర్యోధనుడికంటే ధర్మాత్ముడయిన ధర్మారాజునే పట్టాభిషిక్తుణ్ణి చేయించి భారతదేశ సమగ్రతకు దోహదకారి అయ్యాడు. భీష్మకృష్ణులిద్దరూ దేశ సమగ్రతకోసమే తమ సర్వశక్తుల్నీ వినియోగించినట్లు అర్థమవుతుంది. భారతం భీష్మపర్వంలో భీష్ముడు బోధించిన రాజధర్మాలన్నీ సార్వకాలిక, సార్వజనీన విలువలు కలిగినవే!

విదేశీయులు కూడా మనదేశాన్ని ప్రత్యేకించి ప్రశంసించడానికి కారణం ప్రధానంగా రామాయణ, భారత, భాగవత ఇతిహాసాలే! కుటుంబ విలువలు, సామాజిక విలువలు, భక్తిరీతులూ ఏ సమాజాన్నైనా ప్రభావితం చేసేవే. ఈ అంశాలన్నీ మన భారతీయతను, జాతీయతను ప్రస్ఫుటం చేస్తూ ఉన్నాయి.



# భాగవత సందేశం

మానవుడు సన్మార్గంలో నడవాలి. అధర్మం, స్వార్థం, కోపం, ద్వేషం, గర్వం మానవుడి పతనానికి దారితీస్తాయి. అనే సందేశాన్ని భాగవతం అందిస్తుంది.

భగవంతుడు లోకమంతటా ఉన్నాడు. చిన్నప్పటి నుంచీ మంచి విషయాలు చెబితే పిల్లలు మంచి మార్గంలో నడుస్తారనే సందేశాన్ని ప్రహ్లాద చరిత్ర చెబుతుంది. స్వార్థం, గర్వం పతనానికి హేతువులనే సందేశాన్ని బలిచక్రవర్తి జీవితం అందిస్తుంది. ధర్మబుద్ధితో కల్మషంలేని హృదయంతో అటుకులు సమర్పించినా భగవంతుడు సంతోషిస్తాడనీ కుచేలునికథ మహోన్నత సందేశాన్ని ఇస్తుంది. పరమ భాగవతుల్ని ఇబ్బంది పెట్టాలనుకునే వాళ్లను భగవంతుడు సహించడనే సందేశాన్ని అంబరీషుడి



వృత్తాంతం అందిస్తుంది. దధీచి, శిబి, రంతిదేవుడు వంటి వాళ్ల కథలు – ధర్మగుణాలైన దానశీలత, త్యాగం, మాట తప్పక పోవడం వంటి ఆచరణలు మానవజీవితాన్ని ఉన్నతీకరిస్తాయనే సందేశాన్ని అందిస్తాయి. భగవంతుణ్ణి నమ్మి ప్రార్థిస్తే కష్టాల నుంచి గట్టెక్కిస్తాడనే సందేశాన్ని గజేంద్రమోక్షణం మనకు తెలియజేస్తుంది. భాగవతం మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించే విలువైన సందేశాత్మక పురాణం.

**దశావతారాలసందేశం**

భగవంతుడి అవతారాలు అనంతం. మహాభారతం ప్రకారం విష్ణుమూర్తి అవతారాలు ఇరవై ఒకటి. రాబోయే కల్కి అవతారం ఇరవై రెండవది. విష్ణుమూర్తి అవతారాల్లో పది అవతారాల్ని ప్రత్యేకంగా కీర్తిస్తారు.



**దశావతారాలు**

1. మత్స్య 2.కూర్మ 3.వరాహ 4.నరసింహ 5.వామన 6.పరశురామ 7.శ్రీరామ 8.బలరామ 9.శ్రీకృష్ణ 10.కల్కి అవతారాలు. కొందరు బలరామావతారానికి మారుగా బుద్ధావతారాన్ని పేర్కొంటారు.

**మత్స్యావతారం**

మొదటిది మత్స్యావతారం. యుగాల్లో మొదటిదయిన కృత యుగంలో సోమకుడనే రాక్షసుడు బ్రహ్మ అధీనంలోని వేదాల్ని దొంగిలించాడు. అపుడు శేషశయనుడయిన మహావిష్ణువు సముద్రంలో దాక్కొన్న సోమకాసురుణ్ణి మత్స్యరూపంలో వెదకి, పట్టుకొని సంహరించాడు. జ్ఞాననిధి అయిన వేదరాశిని మరల బ్రహ్మదేవుడికి ఇచ్చాడు. బ్రహ్మమళ్లీ సృష్టి చేయడం ప్రారంభించాడు. ధర్మానికి హాని కలిగినప్పుడు

సమర్థుడైనవాడు కష్టాల్ని ఓర్చుకొని, ధర్మాన్ని రక్షించాలనే విషయమే మత్స్యావతార సందేశం.

**కూర్మావతారం:** శ్రీహరి పాలసముద్రాన్ని చిలికినపుడు సహాయం చేయదలచి కూర్మావతారం ధరించాడు. దుర్వాసుని శాపకారణంగా క్రమంగా దేవతల శక్తి నశించింది. రాక్షసులు బలవంతులయ్యారు. ఇంద్రుడు రాక్షసులను జయించలేక ఓటమి భారంతో వైకుంఠం వెళ్ళి మహావిష్ణువు శరణుజొచ్చాడు. విష్ణువు అతణ్ణి ఓదార్చి “సముద్రాన్ని మథిస్తే అమృతం వస్తుంది. ఆ అమృతాన్ని తాగిన వారికి చావు ఉండదు. అమృతాన్ని సాధిస్తే రాక్షసులను జయించవచ్చు. కనుక దానవులతో స్నేహం చేయండి. వారితో కలిసి సముద్రాన్ని మథిస్తే మీకు అమృతం సిద్ధిస్తుంది. రాక్షసులను మోసగించి అమృత మంతా మీకే దక్కే విధంగా నేను చేస్తాను” అన్నాడు.



దేవతలు రాక్షసులతో మంతనాలాడి పాల సముద్రాన్ని మథించడానికి ఒప్పించారు. సముద్రాన్ని మథించడానికి కవ్వంగా మందరపర్వతాన్ని తెచ్చారు. తాడుగా వాసుకిని తెచ్చారు. తలవైపు రాక్షసులు, తోకవైపు దేవతలు పట్టుకొని, వాసుకిని మందర పర్వతానికి చుట్టి క్షీరసముద్రాన్ని చిలకడం ఆరంభించారు. పర్వతం సముద్రంలో మునిగిపోకుండా విష్ణువు తాబేలు రూపం ధరించి మందర పర్వతాన్ని తన వీపు మీద ధరించాడు. మందర పర్వతం మునగకుండా చేయడానికి విష్ణువు ఎత్తిన అవతారమే కూర్మావతారం.

దేవదానవులు సముద్రాన్ని చిలుకుతుండగా కొంతసేపటికి సముద్రం నుండి లతలు, గుల్మాలు, వృక్షాలు, రత్నాలు వచ్చాయి. తర్వాత హాలాహలం వచ్చింది. ఆ విషాన్ని శివుడు తాగి కంఠంలో నిలుపు కొన్నాడు. ఆ తర్వాత ఐరావతం అనే ఏనుగు,



ఉచ్చైశ్రవమనే గుర్రం, కల్ప వృక్షం, కామధేనువు వచ్చాయి. తర్వాత చంద్రుడు, లక్ష్మీదేవి జన్మించారు. ఆ తర్వాత ధన్వంతరి అమృత కలశంతో పుట్టాడు. ఆ కలశాన్ని రాక్షసులు తీసుకొన్నారు. అమృతకలశం రాక్షసుల వశమైందని దేవతలు చెప్పగా విష్ణువు జగన్మోహిని రూపంతో వచ్చి రాక్షసుల్ని మైమరపించాడు. అమృత కలశం తీసుకొని, అమృతాన్ని దేవతలకు పంచాడు. మోహిని రూపాన్ని విడిచి అంతర్ధానమయ్యాడు.

**వరాహావతారం:** కృతయుగంలో హిరణ్యాక్షుడనే రాక్షసుడు బ్రహ్మను గురించి తపస్సుచేసి గొప్ప వరాలను పొందాడు. ఆ వరాల ప్రభావంతో మునుల్ని, దేవతల్ని, మానవుల్ని బాధించాడు. భూమి మీద జరిగే యజ్ఞ యాగాదుల వలన దేవతలకు శక్తి కలుగుతుంది కాబట్టి దేవతలను బలహీనులుగా చేయాలంటే భూమిని లేకుండా చేయడం మంచి మార్గమని తలపోశాడు.వెంటనే భూమిని పైకెత్తి



మహాసముద్రంలోకి విసిరి వేశాడు. భూమి సముద్ర గర్భంలోకి చేరింది. భూమి మీద నివసించే జీవరాశి తల్లడిల్లింది. దేవతలు ఈ అపాయాన్నుంచి గట్టెక్కించుమని విష్ణువును వేడుకున్నారు.

మహావిష్ణువు వరాహావతారాన్ని ధరించాడు. బలమైన కోరలతో, పొడవైన మూతితో జనించిన వరాహ రూపం తన రూపాన్ని పెంచుకొన్నది. సముద్రంలో ప్రవేశించి భూమిని తన కోరలతో పైకెత్తింది. ఆ సమయానికి హిరణ్యాక్షుడు అక్కడికి వచ్చి వరాహాన్ని అడ్డుకున్నాడు. వరాహరూపంలో ఉన్న నారాయణుడికి హిరణ్యాక్షుడికి భీకరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో వరాహస్వామి తన కోరలతో హిరణ్యాక్షుణ్ణి చీల్చి వేశాడు. అతణ్ణి సంహరించి భూమిని తన కోరలతో పైకి లేపి, తెచ్చి యథాస్థానంలో నిలబెట్టాడు. హిరణ్యాక్షుని చంపి భూమిని కాపాడినందుకు దేవతాసమూహం

సంతసించింది. సమస్త జీవరాశులు ఆనందించాయి.

**నరసింహావతారం:** కృతయుగంలో శ్రీమన్నారాయణుడు నరసింహస్వామిగా అవతరించాడు. నరసింహావతారంలో విష్ణువు తల సింహరూపంలో తక్కిన శరీరం మానవరూపంలో ఉంటుంది.

హిరణ్యకశిపుడనే రాక్షసుడు బ్రహ్మగురించి తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. ఆ రాక్షసుడు బ్రహ్మను చిత్రమైనవరం కోరాడు "గాలిలో కానీ, భూమిపై కానీ, అగ్నిలోకానీ, ఆకాశంలోగానీ, రాత్రికానీ, పగలుకానీ మారణశస్త్రాలవల్ల గానీ, మరి దేని వల్లకూడా చావు రాకూడదు" అని వరం కోరుకున్నాడు. బ్రహ్మవరం ప్రసాదించాడు. హిరణ్యకశిపుడు వరగర్వంతో దేవతల్ని, విష్ణు భక్తుల్ని, చివరకు భక్తుడు అయిన కొడుకు ప్రహ్లాదుణ్ణి కూడా హింసించాడు. హరిభజన చేస్తున్న



కొడుకును చూచి "ఎక్కడ్రా నీహరి?" అని గద్దించాడు "అంతటా ఉన్నాడు నాన్నా! వెదికితే కనపడతాడు" అన్నాడు – ప్రహ్లాదుడు. అతడు పక్కనే ఉన్న స్తంభాన్ని చూపించి, "ఇందులో ఉన్నాడా?" అని దాన్ని గదతో కొట్టాడు. అది రెండు భాగాలుగా చీలిపోయింది. అందులోంచి విష్ణువు నరసింహరూపంతో బయటకువచ్చి, హిరణ్యకశిపుణ్ణి చీల్చి చంపాడు. అధర్మం, రాక్షసత్వం, రాజ్యమేలుతున్నప్పుడు ధర్మాన్ని కాపాడటానికి భగవంతుడు అవతరిస్తాడు.

**వామనావతారం:** పూర్వం బలిచక్రవర్తి అనే రాక్షసుడు ఇంద్రాదిదేవతల్ని తరిమివేసి, స్వర్గాన్ని ఆక్రమించాడుకానీ, ఆ రాక్షసరాజుకు దానం చేసే మంచి గుణం ఉండేది. దేవతల కోరిక మేరకు మహావిష్ణువు వామనావతారం ధరించాడు. వామనుడు అంటే పొట్టివాడు. బ్రహ్మచారి



అయిన వామనుడు యాగం నిర్వహిస్తున్న బలిని మూడు అడుగుల నేలను దానం అడిగాడు. ఇస్తానన్నాడు బలిచక్రవర్తి. అంతే! వామనుడు విశ్వమంతా వ్యాపించాడు. కనుక త్రివిక్రముడు అయ్యాడు. ఒక అడుగుతో ఆకాశాన్నీ, రెండవ అడుగుతో భూమినీ ఆక్రమించాడు. మూడవ అడుగు బలి తలపై పెట్టాడు. ఆ విధంగా బలిని పాతాళానికి పంపించాడు.

బలగర్వం మంచిది కాదనే సందేశాన్ని, తనదికానిదాన్ని అధర్మంగా సొంతం చేసుకోవడం ఎవరికైనా తగదనే సందేశాన్ని వామనావతారం ద్వారా హరి తెలియజేశాడు.

**పరశురామావతారం:** కార్తవీర్యార్జునుడు సహస్రబాహుడు. ఒకనాడు వేటాడి అలిసి జమదగ్ని ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్ని తన కామధేనువు అనుగ్రహంతో కోరిన భోజనం వడ్డింపజేశాడు. కార్త్యవీర్యుడు కామధేనువును తన సొంతం



చేసుకోవాలను కొన్నాడు. దౌర్జన్యంగా తీసుకెళ్ళాడు. ఈవిషయం తెలిసి జమదగ్ని కుమారుడయిన రాముడు మాహిష్మతీపురంపై దాడిచేసి, కార్తవీర్యార్జునుణ్ణి చంపి గోవును తెచ్చాడు.

రాజకుమారులు తమ తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నారు. పరశురాముడు లేని సమయంలో ఆశ్రమం మీద దాడి చేశారు. తపస్సు చేసుకుంటున్న జమదగ్నిని చంపివేశారు. పరశురాముడు ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. మరణించిన తండ్రిని చూశాడు. తండ్రిని చంపిన రాకుమారులందరిని హతమార్చాడు. అసలు భూమిపై రాజులనే లేకుండా చేస్తే అరాచకాలు ఉండవని భావించాడు. ఇరవై ఒక్కసార్లు భూమి మొత్తం తిరిగి దుర్మార్గులైన రాజులందర్నీ తన గండ్రగొడ్డలితో చంపి, లోకానికి గొప్ప సందేశం ఇచ్చాడు – పరశురాముడు.

**శ్రీరామావతారం:** దశరథుడి కుమారుడు శ్రీరాముడు. విశ్వామిత్రుడి యాగ రక్షణకై శ్రీరాముడు, లక్ష్మణుడు వెళ్ళారు. యాగాలకు విఘ్నం కలిగించే తాటకి, సుబాహులనే రాక్షసుల్ని శ్రీరాముడు సంహరించాడు.

అయోధ్యా నగరానికి రాజు కావాల్సిన శ్రీరాముడు తండ్రి కైకకిచ్చిన వరాల్ని తీర్చడంకోసం తండ్రిమాట పాటించి, పదునాల్గు సంవత్సరాలు అరణ్యవాసం వెళ్ళాడు. తాను రాజై, పాలించాల్సిన రాజ్యాన్ని భరతుడికి అప్పగించాడు. ఆ సందర్భంలో శ్రీరాముడు సనాతన సంస్కృతిని నాశనం చేసే రాక్షసులనెందరినో చంపాడు. సీతను అపహరించిన రావణుణ్ణిచంపి, లోకంలో రాక్షసత్వాన్ని రూపుమాపాడు. రాక్షసుడైనా సజ్జనుడైన విభీషణుడికి అభయ మిచ్చాడు. రావణ సంహారానంతరం అయోధ్యకు వెళ్ళి, ప్రజల్ని కన్న



బిడ్డలవలె పాలించాడు. ప్రజల్లో శాంతి, ఆదర్శం, ప్రేమ, సత్యం మొదలయిన గుణాల్ని పెంపొందించాడు. ఆకారం ధరించిన ధర్మంగా రాముడు కీర్తి పొందాడు. ప్రజలకు – రాజుకు మధ్యగల సంబంధం ఎలా ఉండాలో తన చేతల ద్వారా తెలియజేసిన అవతారం రామావతారం.

**బలరామావతారం:** శ్రీకృష్ణుడి అన్న బలరాముడు. ఈయన ఆదిశేషుడి అంశతో అవతరించాడు. శ్రీకృష్ణుడు, బలరాముడు ఇద్దరూ అవతార పురుషులుగా ద్వాపరయుగంలోనే జీవించారు. శ్రీకృష్ణుడి అన్నగా బలరాముడు కొన్ని సలహాలు ఇస్తూ గడిపాడేగానీ శ్రీకృష్ణుడివలె అన్ని విషయాల్లో జోక్యం చేసుకోలేదు. కురుక్షేత్ర యుద్ధాది విషయాల్లో తటస్థంగానే ఉండిపోయాడు. ఈయన భార్య రేవతి. ఆయుధం హలం. కౌరవులపై కోపం వచ్చినపుడు హస్తినాపురాన్ని తన



నాగలితో దున్నే ప్రయత్నం చేశాడు. యమునానదిని తన హలాయుధంతో బీడు భూముల మీద ప్రవహించేటట్లు లాగాడు. చిన్నతనంలో శ్రీకృష్ణుడితోపాటు ఆవుల వెంట గోపాలకుడుగా కూడా సంచరించాడు. అందువల్ల గోవుల పెంపకం, భూమిని వ్యవసాయానికి అనువుగా మార్చడం అనేవి ఈ అవతారంలో ముఖ్యమైన అంశాలుగా తెలుస్తాయి.

**శ్రీకృష్ణావతారం:** ద్వాపరయుగంలో శ్రీహరి దేవకీ వసుదేవులకు ఎనిమిదవ గర్భంగా శ్రీకృష్ణుడు జన్మించాడు. బాల్యంలోనే శ్రీకృష్ణుడు పూతన, తృణావర్తుడు, శకటాసురుడు, మొదలగు రాక్షసుల్ని సంహరించాడు. గోప బాలురతో, గోపికలతో కలిసి మెలిసి తిరిగాడు. గోవర్ధనగిరిని ఉద్ధరించాడు. కాళియ మర్దనం చేశాడు. కంసుణ్ణి చంపాడు. తల్లితండ్రుల్ని చెరసాలనుంచి విముక్తుల్ని చేశాడు.



కృష్ణుడు కురుక్షేత్రయుద్ధంలో ధర్మపరులయిన పాండవుల పక్షంలో నిలిచి పాండవులకు విజయం చేకూర్చాడు. సర్వలోకాలకూ ఆచరణీయమయిన భగవద్గీతను బోధించాడు. శ్రీకృష్ణుడు మానవజాతిని ధార్మిక మార్గంలో నడిపించే ఆదర్శపురుషుడుగా, కర్మయోగిగా, జ్ఞానయోగిగా పూజనీయుడయ్యాడు. శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ ద్వారా ధర్మసంస్థాపన చేసిన మహనీయుడు. ఆయన జీవితమే ఈలోకానికి గొప్ప సందేశం.

**కల్కి అవతారం:** కలియుగంలో మానవులు దుష్ట బుద్ధులు కల్గి ఉంటారు. సంస్కృతీ సంప్రదాయాలు సరిగా ఉండవు. మంచితనం, మర్యాద నశిస్తాయి. స్వార్థం బాగా పెరిగిపోతుంది. అమ్మానాన్నల్ని కూడా పట్టించుకోని బిడ్డలు తయారవుతారు. నీతి, నిజాయితీ కనిపించకుండా పోతుంది. ఈర్ష్య, ద్వేషం, అబద్ధాలు, అవినీతితో ప్రపంచం

నిండిపోతుంది. సత్యం నశిస్తుంది. హత్యలు పెరుగుతాయి. ఇలాంటి పాపాలతో ఈ భూమి కలుషితమైనప్పుడు శ్రీమహావిష్ణువు కల్కిమూర్తియై అవతరిస్తాడు.

వేగవంతమైన, ధృడమైన, మేలు రకం గుర్రం మీద భూమండలమంతా తిరుగుతాడు. కల్కిచేతిలో ఆయుధంగా కత్తి ఉంటుంది. దుష్టుల్ని, దొంగల్ని, అధర్మ మార్గంలో నడిచేవాళ్లనందర్నీ చంపుతాడు. దుష్ట శిక్షణకూ, శిష్టరక్షణకూ దీక్ష వహిస్తూ కలియుగాంతంలో జనులకు రక్షకుడై నిలుస్తాడని పురాణాలు పేర్కొంటున్నాయి. భగవంతుడి అవతారాలు నిర్వహించిన ప్రతి కార్యానికీ ఒక అర్థం, పరమార్థం ఉంటాయి.

**భాగవతం – నవవిధ భక్తులు:**

ప్రతి మానవుడికి పరమ లక్ష్యం మోక్షం. మోక్షమంటే తరువాత జన్మ లేకపోవడం. మోక్షం



పొందడానికి పెద్దలు కొన్ని మార్గాలు సూచించారు. అవి కర్మ భక్తి జ్ఞాన యోగాలు. వీటిలో అందరికీ సులభసాధ్యమైంది భక్తి మార్గం. భగవంతుణ్ణి గూర్చిన శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం – అని భక్తి తొమ్మిది విధాలు. ఈ తొమ్మిది విధాల భక్తిమార్గాల్లో ఏ మార్గంతోనైనా భగవంతుణ్ణి పూజించి మోక్షం పొందవచ్చు.

**శ్రవణం:** నవవిధ భక్తి మార్గాల్లో శ్రవణం (వినడం) మొదటిది. భక్తి జ్ఞానాలకు శ్రవణమే ప్రధానం. భగవంతుడి గుణాలూ, పేర్లూ, కథలూ వినడం వల్ల కూడా భగవంతుడికి దగ్గర కావచ్చు. భక్తి మార్గంలో మొదటిమెట్టు సత్సంగం. సత్సంగంలో ప్రధానాంశం భగవత్కథాశ్రవణం. భగవద్భక్తులతో కూడి ఉండడం, వాళ్ల మాటలు వినడం. సత్సంగం.



శ్రవణం కేవలం చెవుల పనిగా కాకుండా తదేక నిష్ఠతో వినిందంతా మనస్సులో పదిలపరచుకోవాలి. అలాంటి స్థితిలో కథాశ్రవణం ఒకయోగమవుతుంది. పరీక్షిత్తు మహారాజు కథాశ్రవణాన్ని యోగంలా అనుష్ఠించి, దాని ద్వారానే ముక్తి పొందాడు. **శ్రవణాత్ ముక్తిః** అనే వాక్యం సార్థకమయింది.

**కీర్తనం:** నవవిధభక్తి మార్గాల్లో కీర్తనం రెండవది. మిగిలిన ఎనిమిది రకాల మార్గాలకన్నా కీర్తనంలో ఉండే గాన ధర్మం వల్ల మనస్సు సహజంగా ఆకర్షితమవుతుంది. భగవత్సంకీర్తనలో ప్రథమాచార్యుడుగా కీర్తిగాంచిన నారదుడు నారాయణ నామ స్మరణం వల్ల పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంకీర్తన ఫలం ఆయనకు మూడు లోకాల్లో తిరిగి నారాయణుడి నామాన్ని కీర్తించే సామర్థ్యాన్ని కలిగించింది. తల్లి గర్భంలో ఉన్నపుడే



నారాయణ కీర్తనను విని ప్రహ్లాదుడు గొప్ప భగవద్భక్తుడయ్యాడు. భారతంలో కేవలం సంకీర్తనం ద్వారా తన సంతాపాన్ని పోగొట్టుకొన్న భక్తురాలు స్వయంగా భగవంతుడి మేనత్త కుంతి. కలియుగంలో భగవంతుణ్ణి కీర్తించడమే మోక్షానికి సులభ మార్గం. **కలౌకేశవకీర్తనమ్** – అనే ప్రబోధాన్ని సార్థకం చేద్దాం!

**స్మరణం:** భగవంతుణ్ణి మరచిపోకుండా నిరంతరం ధ్యానించడం స్మరణ భక్తి. ఇందుకు నిదర్శనంగా భాగవతంలో కన్పించే ఖట్వాంగ ప్రభువును పేర్కొనవచ్చు. చక్రవర్తి అయిన ఖట్వాంగుడు దేవదానవ యుద్ధంలో దేవతలకు సహాయంగా వెళ్లి, రాక్షసుల్ని సంహరించి విజయం పొందాడు. దేవతలు సంతోషించి వరం కోరుకోమన్నారు. తన జీవిత ప్రమాణం ఇంకా ఎంత ఉందో చెప్పమంటాడు ఖట్వాంగుడు. ముహూర్త మంత్రం ఉందంటారు దేవతలు.

**కం॥ గోవింద నామ కీర్తన**
**గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి**
**త్రివిభుడు చూరగొనియెను**
**గైవల్యము దొల్లి రెండు గడియల లోనన్**
(భాగవతం - 2-11)

భగవన్నామ స్మరణం ఫలమిస్తుందో దీనిబట్టి తెలుస్తుంది అందుకే **స్మరణాత్ ముక్తిః,**

**పాద సేవనం :** భగవంతుడి పాదాల్ని, భక్తుల పాదాల్ని, గురువుల పాదాల్ని, సాధువులపాదాల్ని సేవించటమే పాదసేవన భక్తి. మధురానగరంలోని సుదాముడు బాల రామకృష్ణుల్ని తన ఇంటికి ఆహ్వానించాడు. అర్ఘ్యపాద్యాలు అర్పించి శ్రీకృష్ణుణ్ణి ఈవిధంగా వేడుకొన్నాడు

**నీపాదకమల సేవయు, నీపాదార్చకులతోడి నెయ్యమును, నితాం తాపారభూతదయయును, దాపసమందార! నాకు దయసేయగదే.**



ఇలా భక్తితో భగవంతుడి పాదసేవ చేసే వాళ్ళకు అంతులేని కీర్తిసంపదలు, ఆయుస్సూ కలుగుతాయి.

**అర్చనం:** తులసీ పుష్పమాలలతో భగవంతుణ్ణి పూజించడం అర్చన భక్తి. ఇందుకు మధురానగరంలో కంసుడి పరిచారిక అయిన కుబ్జను ఉదాహరించవచ్చు. రకరకాల సువాసనలతో లేపనాలు తయారు చేయడం ఆమె పని. “నీపేరేంటి? లేపనాలు ఎవరి కోసం తీసుకుపోతున్నావ్?” అని ప్రశ్నించిన కృష్ణుడికి ప్రేమతో తన దగ్గరున్న లేపనాలు అందిస్తుంది. ఆ లేపనాన్ని ఒంటికి పూసుకొని కృష్ణుడు ఆమె పాదాలపై తన పాదాలు మోపి, గడ్డాన్ని స్పృశించగానే కురూపగా ఉన్న కుబ్జ సురూపగా మారిపోయింది. భగవదర్శనాఫలం అలాంటిది.

**వందనం:** భక్తి శ్రద్ధలతో భగవంతుడికి నమస్కరించడం వందన భక్తి. ఆకాశంనుంచి పడుతున్న జలం ఏదోవిధంగానైనా సముద్రంలో కలిసినట్టుగా ఏదేవతకు



నమస్కరించినా అది కేశవుడికే చెందుతుంది. ఇందుకు అక్రూరుడు మనకు నిదర్శనంగా దర్శనమిస్తాడు. బలరామకృష్ణుల్ని రథం మీద మధురకు తీసుకొని పోవడానికి వస్తాడు అక్రూరుడు. బృందావనంలో గోవిందుణ్ణి, బలరాముణ్ణి సమీపించి భక్తి తన్మయుడై రోమాంచంతో ఆనందబాష్పధారలతో బలరామకృష్ణులకు వినయంతో అక్రూరుని వందనం. బలరామకృష్ణులకు వందనం చేయడం ద్వారా అక్రూరుడు భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

**దాస్యం:** దాస్యమంటే సర్వకాల సర్వావస్థల్లో భగవంతుడికి దాస్యం చేస్తూ అదే భావనతో జీవించడం. భాగవతంలో నవవిధ భక్తి మార్గాల్నేకాక – వాత్సల్యాది భక్తి మార్గాలను అనుసరించిన వాళ్లూ ఉన్నారు. రుక్మిణి శ్రీకృష్ణుడి చరణ సేవా భాగ్యాన్ని కోరుతూ, “నీకు దాస్యంబు చేయని జన్మమేల?” అని భక్తిని ప్రదర్శించింది.



గరుత్మంతుడు సదా విష్ణువుకు దాసుడు. విష్ణువే కృష్ణుడుగా అవతరించి నందున ఆ గరుత్మంతుడు సదా భూలోకంలో ఉండక – స్వామి సంకల్పించగానే దిగి వచ్చి స్వామికి వాహనదాస్య సేవ చేశాడు. గోపికలుకూడా శ్రీకృష్ణుడి పాదసేవాభాగ్యంతో దాసులై వర్తించిన వాళ్లే. అసలు విశ్వమంతా భగవంతుడికి దాస్యం చేస్తూ ఉందికదా!

**సఖ్యం:** భగవంతుణ్ణి స్నేహితుడిగా భావించి, ఆయన గుణాల్ని అలవరచుకోడమే సఖ్య భక్తి. సఖ్య భక్తికి అర్జునుడు మంచి ఉదాహరణ. శ్రీకృష్ణార్జునుల అనుబంధం గొప్పది. కృష్ణుడు అర్జునుణ్ణి ‘చెలికాడా! ర’మ్మని పిలిచేవాడు. మరిదిగా మన్నించేవాడు. బంధుభావంతో ఆదరించేవాడు. ఉదార గుణంతో కానుకలిచ్చేవాడు. మంత్రిగా హితోపదేశం చేసేవాడు. గురువై కర్తవ్యాన్ని బోధించేవాడు సారథిగా చనువు చూపేవాడు. హాస్యమాడేవాడు. ఆటలు పట్టించేవాడు. దేవుడితో చేయగలిగే స్నేహం వల్ల ఎన్నో

మంచి గుణాలు అలవడి ఆయనకు దగ్గర కావడం జరిగింది.

**ఆత్మనివేదనం:** మనోవాక్కాయ కర్మలతో భగవంతుడికి శరణాగతి చేయటం ఆత్మ నివేదన భక్తి. దీన్నే ప్రపత్తి, న్యాసవిద్య, ఆత్మనిక్షేపం అని కూడా అంటారు.

ఆత్మనివేదనకు గజేంద్రుడు నిదర్శనంగా కనిపిస్తాడు. త్రికూట పర్వత ప్రాంతారణ్యంలో విహరిస్తున్న గజేంద్రుడు ఒక మడుగులో కాలుపెట్టాడు. కొంతసేపు జలక్రీడలాడాడు. ఇంతలో ఆ మడుగులో ఉన్న ఒక మొసలి ఆ ఏనుగు కాలు పట్టుకొంది. కరిమకరులమధ్య భీకర సంగ్రామం జరిగింది. వెయ్యేండ్లకాలం అలాగే గడిచి పోయింది. స్థానబలం వల్ల మకరిబలం ఎక్కువైంది. గజేంద్రుడికి తన శక్తిపై నమ్మకం సన్నగిల్లింది. దేవుణ్ణి ప్రార్థించడం ప్రారంభించాడు. తన భారమంతటినీ ఆ భగవంతుడిపై వేసి ఆత్మ నివేదనం చేసుకొన్నాడు. శ్రీహరి



ఆ గజరాజును మకరి బారి నుండి రక్షించాడు. ఈవిధంగా భాగవతంలో ఉండే కథల్ని నవవిధభక్తి మార్గాల ద్వారా తెలుసుకొన్నపుడు భక్తుడికీ, భగవంతుడికీ గల సంబంధం వ్యక్తమవుతుంది.

**భాగవతంలో ధర్మాచరణం:**

భాగవతం చదివితే బాగవుతాం అనే నానుడి సత్యం. భాగవతంలో భక్తుల కథలున్నాయి, భక్తుల్ని రక్షించడానికి పూనుకొన్న భగవంతుడి అవతారాలు ఉన్నాయి.

**ఉత్తర గర్భాన్ని రక్షించడం:** అశ్వత్థామ పాండవులను చంపాలని సంకల్పించి, ఉప పాండవులైన ద్రౌపదీపుత్రుల్ని సంహరించాడు. అభిమన్యుడి భార్య ఉత్తర గర్భంలోని పసికందు పరీక్షిత్తును చంపడానికి అస్త్రప్రయోగం చేశాడు. అప్పుడు గర్భస్థ శిశువును శ్రీకృష్ణుడు కాపాడాడు. శిశు సంరక్షణ అపూర్వ ధర్మాచరణమే.



**భీష్ముడికి ముక్తి:** శ్రీకృష్ణుడు ద్రౌపది కోరిక మేరకు అశ్వత్థామను కాపాడి, చిరంజీవిగా నిలచేటట్టు చేశాడు. భీష్ముడు తనలో చేర్చుకొమ్మని శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించాడు. భీష్ముడు భౌతికంగా తనువు చాలించాడు. శ్రీకృష్ణుడు భీష్ముణ్ణి కరుణించి దయాధర్మపరుడయ్యాడు.

**వేదాల పరిరక్షణ:** సోమకాసురుడు వేదాల్ని అపహరించాడు. శ్రీమన్నారాయణ మూర్తి మత్స్యరూపం ధరించి, సోమకుణ్ణి సంహరించి, వేదాల్ని మనకందించాడు.

**అమృతం పంచడం:** దేవతలూ, రాక్షసులూ క్షీరసాగర మథనం చేశారు. అమృతావిర్భావ నిమిత్తం మందర పర్వతం కుంగకుండా శ్రీహరి కూర్మరూపం ధరించాడు. ఆ మథనంలో హాలాహలం పుట్టగా శివుడు ఆ విషాన్ని మింగి ప్రపంచాన్నే రక్షించాడు.

**భూరక్షణ:** హిరణ్యాక్షుడు సముద్రంలో భూమిని ముంచివేశాడు. అప్పుడు శ్రీమన్నారాయణమూర్తి వరాహ



రూపం ధరించి ఆ భూమిని మనకందించాడు. ఇది ప్రపంచ జీవకోటికి చేసిన అపూర్వ హితకార్యం.

**ప్రహ్లాద రక్షణం:** పరమ భక్తుడయిన ప్రహ్లాదుణ్ణి తండ్రి హిరణ్యకశిపుడు హింసించాడు. ఆ ప్రహ్లాదుణ్ణి నృసింహావతారమెత్తి విష్ణువు రక్షించాడు.

**దేవతల రక్షణం:** బలి చక్రవర్తి దేవతల రాజధాని అమరావతిని ఆక్రమించాడు. దేవతలకు నిలువ నీడలేకుండా పోయింది. అప్పుడు బలిని శిక్షించి, వామనమూర్తి దేవతల్ని వాళ్ళ వాళ్ల నివాసాల్లో నిలిపాడు.

**ప్రజా రక్షణ:** పరిపాలకులైన ప్రభువులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఉంటే, అటువంటి వాళ్ల నెందరినో పరశు రామావతారంలో సంహరించాడు. ప్రజారక్షణ నిమిత్తమే ఇది జరిగింది. ఈప్రజారక్షణ ధర్మాచరణే!

**అంతటా ధర్మమే:** శ్రీమన్నారాయణమూర్తి శ్రీరాముడుగా అవతరించాడు. రావణాది రాక్షసుల్ని సంహరించాడు.

ప్రజానురంజకమయిన పరిపాలన చేశాడు. శ్రీరామ చరిత్రలో ధర్మాచరణమే కనిపిస్తుంది.

**అంతా కృష్ణమయం:** అసలు భాగవతమే శ్రీకృష్ణ చరిత్ర. శ్రీకృష్ణుడు ఎందర్ని ఎన్ని విధాలుగా రక్షించాడో చెప్పలేం. కంసుడు, నరకాసురుడివంటి దుర్మార్గుల్ని సంహరించాడు. అందుకే ధర్మాచరణంలో శ్రీకృష్ణపరమాత్మనే ముందు చెప్పాలి.

ధ్రువుడు, అంబరీషుడు, కుచేలుడు, ఉద్ధవుడు, బలరాముడు, ఇంకా ఎందరెందరో ధర్మాచరణంలో నిలిచినవాళ్లే! భక్తి కేంద్రంగా ఉన్న ధర్మాచరణకు సంబంధించిన కథలెన్నో భాగవతంలో ఉన్నాయి.

**భాగవతం – జాతీయ దృక్పథం**

భాగవతం దృష్టి విశ్వప్రయోజనం. అది జాతిని ఒకే తాటిపై నిలుపడానికి స్వేచ్ఛగా జీవిస్తూ బ్రహ్మానందాన్ని



స్వానుభవంతో పొందడానికి దోహదకారి అయింది. భక్తి ద్వారా అందరినీ దైవాను గ్రహానికి పాత్రులను చేస్తూ జాతీయ సమైక్యతకు దారి చూపింది. ప్రేమ అంతర్గతమైన భక్తి భావం సాధించడానికి భాగవతం కృషి చేసింది. భాగవతంలో భక్తే ప్రధానమయింది. ప్రహ్లాదుడు, కుచేలుడు, ధ్రువుడు మొదలైన భక్తులు తమ వ్యక్తిత్వాల ద్వారా మానవత్వ లక్షణాలను ప్రబోధించారు. భక్తి ద్వారా జీవిత పరమార్థాన్ని సాధించుకొని, ఆ మార్గాన్ని ఇతరులందరూ ఆచరించేటట్లు చేశారు. వినయం, విధేయత, సహనం మొదలైన లక్షణాలను వ్యక్తీకరించే కథల ద్వారా భాగవతం సర్వకాలీనమైన జాతీయ సమైక్యతా సందేశాన్ని ప్రజలకు అందించింది.

* * *